సాక్షి మెదక్

ఆదివారం ၊ 13 ၊ ఆగస్టు ၊ 2023



ఉజ్వల భవితకు నవోదయం

ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ నవోదయ విద్యాలయం 2024-25 విద్యా సం వత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 8లో

ఆస్తిలో వాటా దక్కడం లేదని..



తల్లి ఆస్తిలో వాటా రాకుండా అడ్డు తగులుతున్నాడని ఆగ్రహించిన తమ్ముడు సొంత అన్న పైనే పెట్రోల్ పోసి నిప్పంటించాడు ఈ ఘటన కొల్చారంలో మండలం అప్పాజీపల్లిలో జరిగింది. 8లో

19న మెదక్‌కు కేసీఆర్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సీఎం కేసీఆర్ ఈనెల 19న మెదక్‌కు రానున్నారు. జిల్లా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.

న్యూస్‌రీల్

వైభవంగా హోమం



హోమం నిర్వహిస్తున్న పూజారులు

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని కిష్టాపూర్ వేణుగోపాల స్వామి ఆలయంలో మండల పూజలు వైభవంగా నిర్వహించారు. ఇటీవల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా రుక్మిణీ సహిత వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం, పూర్ణాహుతి జరిపించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ రాజగోపాల్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాలలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సర్పంచ్‌ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు, మిర్జాపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మిర్జాపల్లిలో రూ.20 లక్షల నిధులతో పల్లె దవాఖాన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ కొండూరి భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ కృపావతి, సంగని సునీత, ర్యాల సిద్దిరాములు, నేరెళ్ల మధు, శ్రీకాంత్ గౌడ్, కుంట రాజు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర భవనానికి భూమి కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్‌లో వడ్డెర కుల భవన నిర్మాణానికి రెండెకరాల భూమిని కేటాయించాలని సంఘం నాయకులు శనివారం స్థానిక ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నర్సాపూర్ ఒకటో వార్డు కౌన్సిలర్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వారు సన్మానించారు. అనంతరం తమ కుల భవనానికి భూమి కేటాయించాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వడ్డెర సంఘం నాయకులు రాములు, బాషయ్య, ఆంజనేయులు తెలిపారు.

అనుమానితులు సంచరిస్తే సమాచారమివ్వండి



మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తూప్రాన్ సీఐ శ్రీధర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు లేని బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణ కోసం ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అన్నారు. దాతల సహకారంతో ప్రజాప్రతినిధులు వాటి ఏర్పాటుకు ముందుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర సమయంలో 100కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చునన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు 30 మంది దాతలు లక్ష 40 వేల రూపాయలు అందజేశారు. వారిని సీఐ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు రవికాంత్‌రావు, తూప్రాన్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు రవికాంత్‌రావు, మధుసూదన్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, సిబ్బంది, సర్పంచ్ భారతి, ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పారిశుద్ధ్య కమిటీ చైర్మన్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఏది ధీమా.. అందని బీమా!



- భరోసాకు దూరంగా భవన నిర్మాణ కార్మికులు
- పథకాలపై అవగాహన కల్పించే వారు కరువు
- ఏడాదిన్నరగా జిల్లాలో ఖాళీగా అసిస్టెంట్ లేబర్ అధికారి పోస్టు
- ఇన్‌చార్జిగా సంగారెడ్డి అధికారి విధుల నిర్వహణ

భవన నిర్మాణ రంగ కార్మికులకు రక్షణ ఇస్తూ, వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ కార్మిక బీమా పథకం ప్రవేశపెట్టింది. రోడ్లు, భవనాలు, ప్రాజెక్టు పనులు చేసే కార్మికులకు ఆపత్కాలంలో ఈ పథకం ఎంతగానో ఆసరాగా ఉంటుంది. అలాంటి ఈ పథకంపై కార్మికులకు అవగాహన కొరవడటంతో చాలామంది బీమాకు దూరంగా ఉన్నారు. ప్రధానంగా జిల్లాలో కార్మిక శాఖలో అసిస్టెంట్ లేబర్ అధికారి పోస్టు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. సంగారెడ్డి జిల్లాకు చెందిన అధికారి ఇక్కడి ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో కార్మికులకు సంబంధించిన పథకాలపై అవగాహన కల్పించే వారే కరువయ్యారు. కార్మిక బీమా లాంటి పథకాలకు వారు దూరమవుతున్నారు.

మెదక్ : జిల్లా వ్యాప్తంగా 2.30లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు పని చేస్తునట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు కేవలం 22వేల మంది కార్మికులు బీమా చేయించుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రూ.110 చెల్లిస్తే ఐదేళ్ల కాలపరిమితికి బీమా ఉంటుంది. రూ.60 చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే మరో ఐదేళ్లపాటు కొనసాగుతుంది.

అర్హులు వీరే...

ఇంటి నిర్మాణ పనులు చేసే వారందరూ ఈ పథకానికి అర్హులు. ఇందులో పునాదులు తీసే కూలీల నుంచి మొదలుకొని ఇటుకలు మోసే కూలీలు, మేస్త్రీలు, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్, పెయింటర్స్, ఇసుక లేబర్స్ సైతం భవన నిర్మాణ కార్మికుల పరిధిలోకి వస్తారు. వీరందరూ కార్మిక బీమా పొందేందుకు అర్హులే.

లబ్ధి ఇలా..

ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే అతని కుటుంబ సభ్యులకు రూ.6 లక్షల బీమా వస్తుంది. శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.5 లక్షల ఆర్థిక సాయం, పాక్షికమైతే రూ.4 లక్షలు అందిస్తారు. సహజ మరణం పొందితే రూ.లక్ష, అంత్యక్రియల కోసం మరో రూ. 30వేల ఆర్థిక సాయం అందుతుంది. మహిళా కార్మికురాలి వివాహ సాయం కింద రూ. 30 వేలు ఇస్తారు. అదేవిధంగా కార్మికురాలు, లేదా కార్మికుడి పిల్లల పెళ్లిళ్లకు రూ.30 వేల చొప్పున ఇద్దరికి రూ.60 వేలు అందజేస్తారు. మహిళా కార్మికురాలికి ప్రసూతి సహాయం కింద రూ.30 వేలు అందిస్తారు. అలాగే ఇద్దరి పిల్లల ప్రసూతి కోసమైతే రూ.30 వేల చొప్పున అందిస్తారు. ఆరోగ్యం పరంగా ఏమైనా సమస్యలు వస్తే రూ.4,500 వరకు ఆర్థిక సాయం పొందవచ్చును.

దరఖాస్తు విధానం

భవన నిర్మాణ కార్మికుడు లేదా కార్మికురాలి వయస్సు 18 నుంచి 59 ఏళ్ల వరకు ఉండాలి. బీమా నమోదు చేసుకునేటప్పుడు కార్మికుడి కుటుంబ సభ్యుల వివరాలు, నామిని దరఖాస్తులో పొందు పర్చాలి. మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే సమయంలో కార్మికుడిగా పని చేస్తునట్లు ధ్రువీకరణ పత్రం జతచేయాలి. ఈ పత్రాన్ని సహాయ కార్మికశాఖ అధికారి నుంచి పొందాలి. ఆధార్, రేషన్ కార్డు, వయస్సుకు సంబంధించి ధ్రువీకరణ పత్రం కూడా జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న కార్మికుడికి గుర్తింపు కార్డు వస్తుంది.

అవగాహన కల్పిస్తాం



ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రవేశపెట్టిన బీమా గురించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. జిల్లాలో ఇప్పటివరకు 22వేల మంది కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కార్మికులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6లక్షల బీమాతోపాటు అనేక రకాల బెనిఫిట్స్ ఉంటాయి.

– యాదగిరి, ఇన్‌చార్జి లేబర్ సహాయ అధికారి, మెదక్

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న దినకర్

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) 87వ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాందాస్ చౌరస్తాలో జిల్లా కార్యదర్శి దినకర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాలలో ఉద్భవించి, పోరాటాలతో సామ్యవాద సమసమాజ స్థాపన కోసం అవిశ్రాంతంగా పోరు సాగిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాపయ్య, చరణ్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

యాప్‌పై వీడియో ప్రదర్శన



మెదక్ కొత్త బస్టాండ్‌లో వీడియో ప్రదర్శన

మెదక్: ఆర్టీసీ సంస్థ నూతనంగా ప్రవేశ పెట్టిన బస్సు ట్రాకింగ్ యాప్‌పై శనివారం మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ స్థానిక కొత్త బస్టాండ్‌లో వీడియో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా బస్సుల వేళలు, బస్సు ఎక్కడి వరకు వచ్చిందనే విషయాలు తెలుసుకోవచ్చని అన్నారు. దీనిద్వారా ప్రయాణికులకు సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు.

సేంద్రియ సాగు.. బహు బాగు

- కేవీకేను సందర్శించిన టాటా కంపెనీ సీఈఓలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని తునికిలో ఉన్న డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను శనివారం టాటా కెమికల్స్ సీఈఓ ముకుందన్, టాటా ర్యాలీస్ సీఈఓ సంజీవ్‌లాల్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కమలేష్ సందర్శించారు. ఈ సందర్భంగా వారికి కేవీకే చైర్మన్ వినోద్‌రావ్, కేవీకే హెడ్, సైంటిస్ట్ నల్కర్ సేంద్రియ సాగు గురించి వివరించారు. పేడతో వర్మీ కంపోస్ట్ తయారీ, జీవామృతం, బీజామృతం ఎరువులు, సస్యరక్షణకు ఆకుల కషాయంతో సాగవుతున్న పంటల గురించి తెలిపారు. నూతనంగా ప్రారంభించిన జీవ ఎరువుల ప్రయోగశాలను సీఈఓలు సందర్శించి, కేవీకేలో జరుగుతున్న సేంద్రియ సాగును వారు అభినందించారు.

టమాటా రైతు మహిపాల్‌రెడ్డికి సన్మానం

టమాటా పంటసాగుతో రూ.కోటి ఆదాయం పొందిన మహ్మద్‌నగర్ గ్రామ రైతు మహిపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందితే సాగులో మార్పులు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే చైర్మన్ ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ సుందర్‌రెడ్డి, కేవీకే అడ్వైజర్ సుబ్రమణ్యంరాజు, సీఈఓ శ్రీనివాస్, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీకాంత్, రవికుమార్, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, డాక్టర్ భార్గవి, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కేవీకేలో జీవ ఎరువు తయారీ ప్రయోగశాలను పరిశీలిస్తున్న టాటా సీఈఓలు

సీపీఎస్ రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

మెదక్ : సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు సంగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 1 నుంచి ఐఆర్ ప్రకటించి నిర్దిష్ట కాల పరిమితితో పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. 317 జీఓ ప్రకారం ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. 398 స్పెషల్ టీచర్ సర్వీస్‌కు నేషనల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలన్నారు. టీచర్ల పదోన్నతులు, నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ పూర్తిచేయాలని అన్నారు.అదేవిధంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు 5,571 పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని కోరారు. అన్ని పాఠశాలలకు మనఊరు మనబడి వర్తింపచేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మారావు, కొండల్ రెడ్డి, యాదగిరి, నజీరొద్దిన్, భీమ్లానాయక్, రవీందర్ రెడ్డి, పిండి నాగరాజు, సురేందర్ పాల్గొన్నారు.

దళితబంధు అర్హులందరికీ ఇవ్వాలి

- మందాపూర్ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం



ఏకగ్రీవ తీర్మానం చేసుకున్న దళితులు

అల్లాదుర్గం(మెదక్): దళితబంధు అర్హులకు అందించకుండా ఎమ్మెల్యే అనుచరులకే ఇవ్వడంపై దళిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పథకాన్ని ప్రతీ దళిత కుటుంబానికి అందివ్వాలని శనివారం మండల పరిధిలోని మందాపూర్ గ్రామ పంచాయతీ ద్వారా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 120 దళిత కుటుంబాలు ఉంటే ఎమ్మెల్యే అనుచరులైన ఎనిమిది మందికే దళిత బంధు ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇస్తే అందరికీ ఇవ్వాలని, లేదంటే ఎవరికీ ఇవ్వొద్దంటూ పంచాయతీ ద్వారా తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎంపీటీసీ దుర్గయ్య, ఉప సర్పంచ్ రాంరెడ్డితో పాటు దళిత కుటుంబాలు పాల్గొన్నాయి.

నేడు కౌన్సెలింగ్

మెదక్ కలెక్టరేట్: నాన్ టీచింగ్ పోస్టు అభ్యర్థులకు ఆదివారం డీఈఓ, ఎక్స్‌అఫీషియో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ రాధాకిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్‌లలో ఖాళీగా ఉన్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసేందుకు గత నెలలో దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈనెల 9న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసినట్లు తెలిపారు. కాగా ఆదివారం కలెక్టరేట్‌లోని డీఈఓ, ఎక్స్ అఫీషి యో సమగ్ర శిక్ష కార్యాలయంలో ఉదయం9.30 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరు

- వంటా వార్పుతో సెకండ్ ఏఎన్ఎంల నిరసన



కలెక్టరేట్ ఎదుట వంటావార్పు

మెదక్ కలెక్టరేట్: న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చే వరకు పోరు కొనసాగిస్తామని సెకండ్ ఏఎన్ఎంలు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట వంటా వార్పు, సహపంక్తి భోజనాలు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్ఎంల జిల్లా నాయకురాలు తన్వీర్ మాట్లాడుతూ.. తాము కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఏఎన్ఎంలకంటే ఎక్కువ సేవలు అందిస్తున్నామని తెలిపారు. రెగ్యులరైజ్ అవుతుందన్న ఆశతో అన్నిరకాల ఒత్తిళ్లు భరిస్తూ పనిచేస్తున్నామని అన్నారు. తమను రోడ్డుపాలు చేసే విధంగా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయం అన్నారు. నోటిఫికేషన్ రద్దు చేసి సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గ, రమ్య, విజయ, తులసి, యాదమ్మ, సంగీత పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చట్టాలు

- ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి హేమ భార్గవి



మాట్లాడుతున్న హేమ భార్గవి

నర్సాపూర్ రూరల్: మహిళల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి హేమ భార్గవి అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్ద చింతకుంటలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల భద్రత కోసం షీటీంలు, భరోసా, సఖి కేంద్రాలు పనిచేస్తున్నాయని, ఆపద సమయంలో వాటి టోల్ ఫ్రీ నెంబర్లు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. గ్రామంలోని అంగన్‌వాడీ సమస్యలను అధికారి దృష్టికి తీసుకుపోయారు. వాటిని పరిష్కరించడంతో పాటు ఫ్రీ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని హేమ భార్గవి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి హేమ భార్గవి శనివారం తెలిపారు. కేంద్రాలలో చిన్నపిల్లలు, గర్భిణీ, బాలింతలకు సంఖ్యకనుగుణంగా ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా ప్రతినెలా ఐదు రకాల నిత్యావసర సరుకులు అందించేందుకు ప్రభు త్వం చర్యలు తీసుకుంటుందన్నారు. 300 గ్రాముల కారం, 200 గ్రాముల పోపు దినుసులు, 100 గ్రాముల పసుపు, 500 గ్రాముల అయోడిన్ ఉప్పు, 500 గ్రాముల చింతపండులతో కూడిన బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

డంప్ లేక ఆలయ భూములు కంపు

- నత్తనడకన డంపింగ్ యార్డ్ నిర్మాణం
- దేవాలయ భూముల్లో చెత్త పారబోత



నర్సాపూర్ నిర్మిస్తున్న డంప్‌యార్డు భవనం

నర్సాపూర్: నర్సాపూర్‌లో నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పట్టణంలో సేకరించిన చెత్తను జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దేవాలయ భూములలో పారబోస్తున్నారు. చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాలన్న ఉద్దేశంతో ఏడాది క్రితం 33లక్షల రూపాయల వ్యయంతో డంప్‌యార్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. షెడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ వివిధ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. గోడల మధ్య గ్రిల్స్ బిగించడం, భవనానికి రంగులు వేసే పనులతో పాటు తడి చెత్తను ఆరబెట్టేందుకు బెడ్స్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. డంప్‌యార్డుకు కరెంటు కనెక్షన్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ బిగించాల్సి ఉంది. దీనికోసం మున్సిపల్ కమిషనర్ విద్యుత్ శాఖకు లేఖ రాసినా ఇంతవరకు స్పందన లేదు. డంప్‌యార్డుకు కరెంటు కనెక్షన్ ఉంటేనే సేంద్రియ ఎరువు తయారు చేసే పనులు సాగుతాయి. కాగా మున్సిపాలిటీలో రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో నిర్మాణ పనులలో జాప్యం జరుగుతుందని ఆరోపణలు వస్తున్నాయి. ఇన్‌చార్జ్ ఏఈ వారానికి రెండు రోజులు వచ్చి పోతుడటంతో నిర్మాణ పనుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి.

చెత్తమయం

డంపింగ్‌యార్డు పనులు పూర్తికాకపోవడంతో పట్టణంలో సేకరించిన చెత్తను నర్సాపూర్– మెదక్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దేవాలయ భూముల్లో వేస్తున్నారు. దీంతో ఆలయ భూములు చెత్తమయంగా మారాయి. డంప్‌యార్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ఆలయ భూములలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చివరి దశలో పనులు



డంప్‌యార్డు పనులు చివరి దశలో ఉన్నాయి. అసంపూర్తిగా ఉన్నవి త్వరలో పూర్తి చేయిస్తాం. ట్రాన్స్‌ఫార్మర్ కోసం ప్రతిపాదన పంపించాం. త్వరలో బిగించే అవకాశం ఉంది. 20 రోజులలో డంప్‌యార్డును వినియోగంలోకి తెస్తాం.

– వెంకట్‌గోపాల్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

దుర్గమ్మ ఆలయంలో చోరీ



హుండీని ధ్వంసం చేసిన దొంగలు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని తోర్నాల దుర్గామాత ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఏఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి అమ్మవారి అరతులం బంగారం, ముక్కుపుడక, 12 తులాల వెండి, రెండు హుండీలలో నగదు సుమారు రూ. 60 వేలు ఎత్తుకెళ్లారు. ఈమేరకు కమిటీ అధ్యక్షుడు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టు ఇదే..

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పురుషుల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు గజ్వేల్ ఫుట్‌బాల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేష్, గణేష్, కోచ్ నర్సింలులు తెలిపారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో జట్టును ఎంపిక చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా పరిధిలోని సిద్దిపేట, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, తూప్రాన్ తదితర ప్రాంతాల నుంచి 75 మంది క్రీడాకారులు తరలివచ్చారని, వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 20 మంది క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఈనెల 16 నుంచి 19 వరకు వనపర్తి జిల్లా పెబ్బేరులో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్లమధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

SERVICES

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788615]

MACHINES FOR SALE

■ TATA Hitachi Zaxis-370, Two Machines For Sale, Model-2021, Running Hours 15000, Good Running Conditions, @ Andhra Pradesh Granite (Midwest)Pvt Ltd., Chimakurthy,Ongole - AP. Ph : 7032643709, 9000899762. [HA-501]

GRANITE MACHINES FOR SALE
a) SOCOMEC Italian 72 Multi Wire Variable Thickness Sparingly Used Cutting Machine, In Perfect Running Condition with All Accessories.
b) BARSANTI Italian 16 Head, Brand New Unused Fully Automatic Polishing Line, Perfect Trial Condition with All Accessories.
7397741830
BANGALORE

WANTED

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221515]

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్8K ఫోన్: 9640400073 [HA-189320]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-11729]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788737]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉజ్వల భవితకు నవోదయం

• ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం • ఈనెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): చక్కని చదువుతో భవిష్యత్‌కు బాటలు వేసుకోవడం.. స్వయంకృషితో భవితను దిద్దుకునే చదువుల కోవెల ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ నవోదయ విద్యాలయం. 2024–25 విద్యా సంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశానికి జనవరి 20వ తేదీన ప్రవేశ పరీక్ష జరగనుంది. ఇందుకోసం విద్యార్థుల నుంచి ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఉచితంగా పుస్తకాలు, దుస్తులు

విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు తదితర వసతులన్నీ ఉచితమే. రాష్ట్రంలోని ఇతర నవోదయలకు భిన్నంగా ఇక్కడ హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సు కూడా ఉంది. ఆరు, ఏడు తరగతులు మాతృభాషలో, ఎనిమిదో తరగతి నుంచి ఆంగ్లంలో విద్యాబోధన చేస్తారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందింపజేసేందుకు బోధనలో లెర్నింగ్ బై డూయింగ్ విధానం అనుసరిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



2024– 25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 17 వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత పాఠశాల హెచ్‌ఎంతో ధృవీకరణ చేయించి ఆన్‌లైన్‌లో గడువులోగా అప్‌లోడ్ చేయాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– రాజేందర్, ప్రిన్సిపాల్, వర్గల్ నవోదయ

వసతుల సమాహారం

తరగతుల నిర్వహణకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యం కోసం అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్.. పచ్చని వృక్షాలు, ఆహ్లాదం పంచే పార్కుతో విద్యాలయ అలరారుతుంది. విద్యార్థిలో కొంగొత్త ఆలోచనలకు బీజం వేసేలా స్మార్ట్ క్లాస్ బోధన జరుగుతుంది. సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ దేనికదే ప్రత్యేకంగా నిలుస్తాయి. అలాగే రాష్ట్రంలోనే అత్యుత్తమ 400 మీటర్ల ట్రాక్‌తో స్టేడియం, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు, జిమ్ ఉన్నాయి. ఆటలలో శిక్షణ కోసం వ్యాయామ ఉపాధ్యాయులు, సంగీత శిక్షణకు మ్యూజిక్ టీచర్, డ్రాయింగ్‌లో ప్రావిణ్యతకు డ్రాయింగ్ మాస్టర్ ఉన్నారు.

జనవరి 20న ప్రవేశ పరీక్ష

వర్గల్ నవోదయ ప్రవేశానికి జనవరి 20న ఎంట్రన్స్ టెస్ట్ (జేఎన్‌వీఎస్‌టీ పరీక్ష) జరుగుతుంది. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17వరకు ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.నవోదయ.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. మొత్తం 80 సీట్లలో గ్రామీణ విద్యార్థులకు 75 శాతం, పట్టణ విద్యార్థులకు 25 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారు. అందులో దివ్యాంగులకు 3 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం కనీస రిజర్వేషన్ ఉంటుంది. మొత్తంగా బాలికలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారు.

ఆస్తిలో వాటా దక్కడం లేదని..

• సొంత అన్న పైనే పెట్రోల్ పోసి నిప్పంటించిన తమ్ముడు



మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు

కొల్చారం(నర్సాపూర్): తల్లి ఆస్తిలో తనకు వాటా రాకుండా అడ్డు తగులుతున్నాడని ఆగ్రహించిన తమ్ముడు సొంత అన్న పైనే పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈసంఘటన మండలంలోని అప్పాజీపల్లిలో శనివారం జరిగింది. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిమ్మక్కపల్లి శంకరయ్య, లక్ష్మికి ముగ్గురు కుమారులు. వీరిలో రెండో కుమారుడైన ప్రశాంత్‌ను ఎనిమిదో ఏట అదే గ్రామానికి చెందిన చింతల రాములు ఇంటికి ఇల్లరికం పంపారు. తండ్రి పదేళ్ల క్రితం చనిపోవడంతో ఉన్న మూడెకరాలు తల్లి పేరుపై మారింది. ఇదే సమయంలో ఆస్తి వాటా పంపకాలపై ఇల్లరికం వెళ్లిన ప్రశాంత్ అన్న ప్రవీణ్, తమ్ముడు అశోక్‌తో కొంతకాలంగా గొడవ పడుతున్నాడు. తల్లి మాత్రం ఆస్తిని ముగ్గురు సమానంగా పంచుకోవాలని సూచించింది. ఇదే విషయమై శుక్రవారం రాత్రి అన్నదమ్ముల మధ్య గొడవ జరగడంతో ప్రవీణ్ తల్లిపై చేయి చేసుకున్నాడు. ప్రశాంత్ ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించిన తల్లిని అడ్డుకొని ఇంటి గేటుకు తాళం వేసి పడుకున్నాడు. దీంతో అన్నపై కక్ష పెంచుకున్న ప్రశాంత్, అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి వెంట తెచ్చిన పెట్రోల్‌ను వరండాలో నిద్రిస్తున్న ప్రవీణ్‌పై పోసి నిప్పంటించాడు. అరుపులు విన్న భార్య లావణ్య, చుట్టుపక్కల వారి సహాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించింది. అనంతరం చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. 90 శాతం శరీరం కాలిపోవడంతో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు. ప్రస్తుతం ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉందని.. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పంట రక్షణకు వేస్తే.. ప్రాణమే పోయింది

• విద్యుత్ తీగలు తాకి రైతు మృతి



సంఘటనాస్థలంలో రాములు మృతదేహం

రేగోడ్(మెదక్): అడవి పందుల నుంచి పంటను కాపాడేందుకు ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలు తాకి రైతు మృతిచెందాడు. ఈసంఘటన మండలంలోని ఆర్.ఇటిక్యాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు రాములు (38) తనకున్న నాలుగెకరాల వ్యవసాయ క్షేత్రంలో అడవి పందుల భారి నుంచి పంటను కాపాడేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం ఉదయం చేనుకు వెళ్లి కరెంట్ ఉన్న విషయం మరిచిపోయాడు. ప్రమాదవశాత్తు తీగలకు తాకి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హత్య.. ఆత్మహత్యా..?

దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు



సీసీ ఫుటేజీలో వివాహితను తీసుకువస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పదంగా మృతిచెందిన వివాహిత మృతి కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన సుధారాణి శుక్రవారం మృతి చెందింది. మృతిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి సుధారాణిని తీసుకువచ్చి.. గుట్టుచప్పుడు కాకుండా జారుకున్న వ్యక్తి ఎవరనే దానిపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఆస్పత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను సేకరించారు. వచ్చిన వ్యక్తి ఎందుకు భర్త అని చెప్పాడు, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు జారుకున్నాడు అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. ఏడు నెలలుగా శాంతినగర్‌లో ఉంటున్న సుధారాణి, భర్త రామకృష్ణకు కుటుంబ తగాదాలు ఏమైనా ఉన్నాయా, మృతికి గుర్తుతెలియని వ్యక్తికి ఏమైనా సంబంధం ఉందా, ఆర్థిక ఇబ్బందులు కారణమా..? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోపక్క సుధారాణి ఆత్మహత్య చేసుకుందా, లేక ఎవరైనా ఉరి బిగించారా అని తెలుసుకునేందుకు పోస్టుమార్టం నిర్వహించి, ఎఫ్‌ఎస్‌ఎల్ ల్యాబ్‌కు పంపారు.

బాలికపై అత్యాచారం

జగదేవ్‌పూర్(గజ్వేల్): వెంచర్‌లో ప్లాట్ చూడడానికి స్నేహితుడితో కలిసి వెళ్లిన మైనర్‌పై యువకుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. అడ్డుకోబోయిన స్నేహితుడిపై దాడి చేశాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ వెంచర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక (16) తన స్నేహితుడితో కలిసి ఈనెల 7వ తేదీన ద్విచక్ర వాహనంపై జగదేవ్‌పూర్ మండలంలోని పీర్లపల్లి గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ వెంచర్‌లో ప్లాట్ చూసేందుకు వచ్చింది. అయితే అక్కడికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఇక్కడ మీరు ఏం చేస్తున్నారని బెదిరించారు. స్నేహితుడిపై దాడి చేసి బాలికను బైక్‌పై అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక స్పృహ తప్పి పడిపోగా తన బైక్‌పై ఎక్కించుకుని వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై దింపి వెళ్లిపోయారు. స్పృహలో నుంచి తేరుకున్న బాలిక జరిగిన విషయాన్ని తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపింది. వెంటనే కుటుంబ సభ్యులు గౌరారం చేరుకుని బాలికను ఇంటికి తీసుకెళ్లారు. మరుసటి రోజు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ చంద్రమోహన్ పోక్సో కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టామని.. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

• భర్త, అత్తింటి వారే హత్య చేశారని ఆందోళన



జ్యోతి (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): అనుమానాస్పదంగా వివాహిత మృతిచెందిన సంఘటన చిలప్‌చెడ్ మండలం గుజిరి తండా పంచాయతీ పరిధిలోని సీత్యా తండాలో శనివారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. తండాకు చెందిన ముడావత్ మహేష్, చండ్రియా తండాకు చెందిన రమావత్ జ్యోతి (20) ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం హైదరాబాద్‌లో జీవనం సాగించారు. అయితే నెల రోజులుగా తండాలోనే ఉంటున్నారు. ఈనెల 11వ తేదీన జ్యోతికి కడుపునొప్పి రావడంతో భర్త మహేష్ తన మామ సురేష్‌కు సమాచారం ఇచ్చాడు. అనంతరం సిరిపురలోని ఓ ఆస్పత్రిలో జ్యోతికి చికిత్స చేయించారు. శనివారం ఉదయం మామకు ఫోన్ చేసి మీ కూతురు ఉరేసుకుని చనిపోయిందని చెప్పాడు. వారు వచ్చి చూడగా జ్యోతి మృతదేహం మంచంపై పడుకోబెట్టి ఉంది. దీంతో అల్లుడిపై అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అయితే మృతురాలి బంధువులు జ్యోతిది ఆత్మహత్య కాదని, అత్తింటి వారే హత్య చేశారని వారి ఇంటిని ధ్వంసం చేశారు. అప్రమత్తమైన పోలీసులు మృతురాలి భర్త మహేష్, అత్తమామలను ఇంటిలోనే ఉంచి తాళం వేశారు. ఇంటి తలుపులు పగులగొట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వారిపై సైతం దాడి చేయడంతో ఇద్దరు పోలీసులు స్వల్పంగా గాయపడ్డారు. నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మధార్ మృతురాలి బంధువులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు.

వేటకు వెళ్లి.. శవమై తేలి



రాజు(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతిచెందాడు. ఈసంఘటన మండలంలోని మల్లుపల్లి తండా సమీపంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ రవికాంతరావు కథనం ప్రకారం.. చేగుంట మండలం బొమ్మారం గ్రామానికి చెందిన పిట్ల రాజు (25) పిట్టలను వేటాడి వాటిని విక్రయించి ఉపాధి పొందుతున్నాడు. బుధవారం పిట్టలను పట్టేందుకు మండలంలోని గుండ్లపల్లి, మల్లుపల్లి తండా సమీపంలోకి వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందాడు. ఇంటికి రాకపోవడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు గుండ్లపల్లి పరిసరాల్లో వెతకగా బైక్, చెప్పులు లభ్యం అయ్యాయి. వాటి ఆధారంగా పరిసరాల్లో వెతికినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. శనివారం తండా సమీపంలోని నీటి గుంతలో మృతదేహం తేలడంతో గుర్తించిన తండా వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

మహిళ ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అక్కన్నపేటలో జరిగింది. గ్రామానికి చెందిన జంగం బాలవ్వ(65) రెండు రోజులుగా కనిపించకుండా పోయింది. ఈక్రమంలో గ్రామ చెరువులో శనివారం మృతదేహం తేలింది. కాగా బాలమణి భర్త గతంలోనే మృతిచెందగా ప్రస్తుతం కుమారుడి వద్ద ఉంటుంది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేసు విచారణ

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని షాద్‌నగర్ (గట్‌పల్లి) గ్రామానికి చెందిన తెలుగానం శ్రీలత (21)ఈనెల 8న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే శ్రీలత మృతికి భర్త సిరూర్ రవితో పాటు అత్తమామల వరకట్న వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఈ కేసు విషయమై సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్ జోగిపేట సీఐ నాగరాజుతో కలిసి గట్‌పల్లిలో విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు ముందు పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం వట్‌పల్లి స్టేషన్‌కు చేరుకొని మృతురాలి భర్తతో పాటు అత్తమామలను విచారించారు.

అయ్యో బిడ్డా..

• అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
• అల్లుడే హత్య చేశాడని ఆరోపణ



ప్రియాంక మృతదేహం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నర్సాపూర్ రూరల్: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన మండలంలోని మూసాపేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ షాపూర్‌కు చెందిన మద్దెల మల్లేష్, నీలమ్మకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. కూతురు ప్రియాంక (25)ను నాలుగేళ్ల క్రితం గ్రామానికి చెందిన కాసాల అనిల్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. శనివారం ప్రియాంక ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకునే లోపే మృతదేహాన్ని కిందికి దింపి ఉంచారు. దీంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. తమ కూతురును అల్లుడే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. తరచూ పిల్లలు పుట్టడం లేదని, అదనపు కట్నం తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేసేవాడన్నారు. మరో పెళ్లి చేసుకుంటానని నిత్యం వేధించేవాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సాపూర్ ఆస్పత్రిలో మృతదేహాన్ని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం అనిల్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిపారు.

పుత్రశోకం

• ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లడిల్లిన తండ్రి



భూమేష్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): తల్లి ప్రేమకు నోచుకోలేదు.. బాల్యపు రుచులు చవి చూడలేదు. పాలేరుగా పశువులు మేపుతూ 16 ఏళ్లకే జీవితాన్ని ముగించాడు. ఆసరా అవుతాడనుకున్న కొడుకు అర్ధంతరంగా తనువు చాలించడంతో తండ్రి తల్లడిల్లిపోయాడు. ఎస్సై మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని కొడుపాకకు చెందిన జుట్టు దుర్గయ్య, మంజుల దంపతులకు ఒక్కగానొక్క కొడుకు భూమేష్ (16). గుంట భూమి, నిలవ నీడలేకపోవడంతో కట్టుకున్న భర్తను, నవమాసాలు మోసిన కన్న కొడుకును విడిచిపెట్టి భార్య తన దారి తాను చూసుకొంది. అప్పటి నుంచి అన్నీ తానై దుర్గయ్య కొడుకు బాధ్యతలు చూసుకున్నాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన సంగయ్య దగ్గర పాలేరుగా కుదిర్చాడు. ఈనెల 9వ తేదీన పశువులు కాసేందుకు వెళ్లిన భూమేష్ ప్రమాదవశాత్తు మంజీర నదిలో మునిగాడు. మూడు రోజులుగా పోలీసులు, గ్రామస్తులు నదిని జల్లెడపట్టినా ఆచూకీ లభించలేదు. చివరకు శనివారం కొడుపాక సమీపంలో మృతదేహం కనిపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'రైస్ పుల్లింగ్' ముఠా గుట్టు రట్టు

• రూ. 10 లక్షలు, ఇన్నోవా, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రైస్ పుల్లింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. సీఐ సత్యనారాయణరెడ్డి శనివారం రాత్రి వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఆయుర్వేదిక్ డాక్టర్ ముద్దాల రాజా, హైదరాబాద్ చింతల్ బస్తీకి చెందిన డ్రైవర్ ఉప్పల సురేశ్, జనగామ జిల్లా పెద్దపహాడ్‌కు చెందిన విద్యార్థి మరికొకల ప్రశాంత్, జిల్లా కేంద్రంలోని సరస్వతినగర్‌కు చెందిన ధరావత్ సుజాత, ఏపీలోని గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన అడ్వకేట్ ప్రకాశ్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. తమ వద్ద రైస్ పుల్లింగ్ సాధనం ఉందని.. ఇది కలిగి ఉన్న వ్యక్తులు అద్భుతాలు సృష్టిస్తారని నమ్మబలికారు. దీనికి మార్కెట్‌లో చాలా గిరాకీ ఉందని ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన మేక సుబ్బారెడ్డి అనే వ్యక్తి సాధనాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చాడు. సుబ్బారెడ్డికి చేర్యాల పట్టణ కేంద్రంలో కలశం ఇస్తామని చెప్పిన ముఠా పట్టణం నుంచి కడవేర్గుకు వెళ్లే దారిలో ఓ గుడి వద్దకు రూ. 80 లక్షలు తీసుకునిరావాలని చెప్పారు. నమ్మిన సుబ్బారెడ్డి రూ. 10 లక్షల 75 వేలు తీసుకుని వచ్చాడు. డబ్బు తీసుకున్న ముఠా కలశం ఇవ్వకుండా మిగిలిన డబ్బు తీసుకురావాలని చెప్పి ఇన్నోవాలో పారిపోయారు. జరిగిన మోసాన్ని గ్రహించిన సుబ్బారెడ్డి వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటికే వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి సదరు ముఠా సభ్యులు పారిపోతున్న వాహనం రాగానే పట్టుకుని, అందులో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 10లక్షలు, ఇన్నోవా, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీ: ఒకరి దుర్మరణం

చేర్యాల(సిద్దిపేట): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన బొడిగం చంద్రారెడ్డి (75) శనివారం ఉదయం రేషన్ బియ్యం తెచ్చేందుకు సైకిల్‌పై వెళుతూ గాంధీ సెంటర్ సమీపంలోని సాయిరక్ష ఆస్పత్రి ఎదుట యూటర్న్ తీసుకుంటుండగా, జనగామ వైపునకు వెళుతున్న గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. చంద్రారెడ్డి తలకు, చేతికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకువెళ్లాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమోసాలో పురుగులు

అస్వస్థతకు గురైన విద్యార్థినిలు

మోమిన్‌పేట: సమోసాలు తిని ఇద్దరు విద్యార్థినిలు అస్వస్థతకు గురైన ఘటన బంటార్వం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో చోటు చేసుకుంది.. వివరాల ప్రకారం.. మండలంలోని దుర్గంచెరువు గ్రామానికి చెందిన ఎర్రనాగు అంజయ్యకు ఇద్దరు కూతురులు నాగలక్ష్మి, శ్రీవాణిలు. వారిద్దరు బంటార్వం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. రెండవ శనివారం కావడంతో కూతుళ్లను కలిసేందుకు బంట్వారం వెళ్తూ మోమిన్‌పేట న్యూ బస్టాండు సమీపంలో ఉన్న న్యూ రాజస్థాన్ స్వీట్ హౌజ్‌లో సమోసాలు తీసుకొని వెళ్లి కుమార్తెలకు ఇచ్చాడు. అవి తిన్న వారు వాంతులు చేసుకున్నారు. దీంతో సమోసాలను పరీక్షించగా అందులో పురుగులు ఉన్నాయి. అస్వస్థతకు గురైన విద్యార్థినిలను ఇంటికి తీసుకువెళ్లాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి పేర్కొన్నారు. దీంతో ఎర్రనాగు అంజయ్య కూతుళ్లను మోమిన్‌పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లాడు. స్వీట్ హౌజ్‌లను, బేకరీలను అధికారులు తనిఖీలు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యపరంగా ఎంతో కీలకంగా ఉండే ఆహార పదార్థాలపై ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

గజ్వేల్‌రూరల్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని రంగంపేటకు చెందిన చెక్కల శ్రీనివాస్ (45) తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయంతో పాటు మేస్త్రీ, కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలోని పల్లె చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మునిగిపోయాడు. శనివారం పొలాల వద్దకు వెళ్తున్న గ్రామస్తులు చెరువు సమీపంలో శ్రీనివాస్‌కు చెందిన ద్విచక్ర వాహనం, బట్టలు పడి ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించగా శ్రీనివాస్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టి వెలికితీశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

లింక్ పంపి.. డబ్బులు కొట్టేసి..



పటాన్‌చెరు టౌన్: నో బ్రోకర్ యాప్‌లో ఇల్లు అద్దెకు తీసుకుంటానని ఓ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి బాధితుడు రూ. లక్ష పోగొట్టుకున్నాడు. ఈసంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని గణేష్‌నగర్ ఎంపైర్ మెడోస్‌కు చెందిన వ్యక్తి ఇల్లు అద్దెకు ఉందని యాప్‌లో పెట్టాడు. ఈక్రమంలో 9వ తేదీన అపరిచిత వ్యక్తి తనకు ఇల్లు అద్దెకు కావాలని చెప్పాడు. అద్దె చెల్లిస్తానని అందుకోసం ఓ లింకు పంపుతున్నానని దాన్ని క్లిక్ చేయమని చెప్పాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేయగా ఖాతా నుంచి నాలుగు దఫాలుగా రూ. లక్ష కట్ అయ్యాయి. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైం పోలీసులకు.. అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గొర్రెల పెంపకంతో ఆర్థికంగా రాణించాలి



గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర ప్రభుత్వం అందించిన గొర్రెలను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వెంకటయ్య అన్నారు. మండలంలోని రామాయిపల్లిలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని 28 మంది లబ్ధిదారులకు 28 యూనిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించిన గొర్రెలను పెంచుకోవాలని, వాటిని ఎవరూ అమ్ముకోకూడదన్నారు. గొర్రెల పెంపకం వృత్తిగా జీవనం సాగిస్తున్న గొల్ల – కురుమలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి సాధించాలని ఈ పథకానికి సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, గోపాల్‌రెడ్డి, ఫజల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పులింగాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రేషన్ దుకాణాలకు నేటికీ బియ్యం సరఫరా చేయకపోవడంపై ప్రభుత్వం, అధికారుల తీరును విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రతీ నెల 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం ఇతర వస్తువులు సరఫరా చేసేవారని కానీ గత కొంతకాలంగా ఇష్టానురీతిగా సరఫరా చేస్తున్నారని అన్నారు. దుకాణాలకు నెల ప్రారంభానికి ముందే చేరాల్సిన బియ్యం నేటికి సరఫరా కాకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి, ప్రతీ నెల మొదటివారం నుంచే బియ్యం పంపిణీ చేయాలని కోరారు.

అంజన్న సన్నిధిలో పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. దంపతులు సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, సిబ్బంది ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- త్రిష దామోదర్

రేగోడ్(మెదక్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని త్రిష దామోదర్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శనివారం పల్లె పల్లెకు త్రిషమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. తన తండ్రి దామోదర్ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ.. మళ్లీ అధికారంలోకి వస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని చెప్పారు. కాగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో పదిమంది చేరారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావు తెలిపారు. వీరికి త్రిష దామోదర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ముభీమ్, గ్రామ అధ్యక్షుడు సాయిలు, నాయకులు శంకరప్ప, బాలయ్య, వీరప్ప, సంగప్ప, వీరప్ప, హన్మప్ప, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో సీసీ రోడ్డు పనులను శనివారం వార్డు కౌన్సిలర్ ఇష్రత్ సిద్దీఖా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ వార్డులో ప్రస్తుతం వాటర్ ప్లాంట్ నుంచి రహమాన్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు బీఆర్ఎస్ నాయకులు దావుద్ తదితరులు పాల్గొన్నారు.

నడక నరకమే..



నర్సంపల్లి చిన్న తండా రోడ్డు దుస్థితి

అధ్వానంగా రోడ్లు

- అవస్థలు పడుతున్న గిరిజనులు

రామాయంపేట(మెదక్): అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిన తండా పరిధిలో రోడ్లు పూర్తిగా పాడైయ్యా యి. దీంతో రెండు తండాలకు చెందిన గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్ద తండా ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందింది. కాగా పంచాయతీ పరిధిలో నర్సంపల్లి పెద్ద తండాతో పాటు చిన్న తండా రోడ్లు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. పెద్ద తండా రోడ్డుపై గుంతలు తేలడంతో కాలినడక కష్టతరంగా మారింది. చిన్నతండాకు ఉన్న మట్టిరోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు కూడా వెళ్లలేకపోతున్నాయి. నార్సింగి – నర్సంపల్లి తారు రోడ్డు నుంచి చిన్నతండా, కాస్లాపూర్ మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ తారురోడ్డు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులను కోరినా ఎవరూ పట్టించుకోవడంలేదని వారు వాపోయారు.

పాపన్నపేట(మెదక్): తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల పుణ్యక్షేత్రం రహదారి యమపురికి దారిగా మారుతోంది. నాగ్సాన్‌పల్లి కమాన్ దాటగానే వైన్స్ సమీపంలో రోడ్డుపై నాలుగు ఫీట్ల గొయ్యి పడి రెండు నెలలు అవుతోంది. అసలే సింగిల్ రోడ్డు కావడంతో ప్రయాణికులు ఏ మాత్రం అదమరిచినా.. అంతే సంగతులు. అనునిత్యం వందలాది వాహనాలు రాష్ట్ర, అంతరాష్ట్రాల నుంచి వస్తుంటారు. ముఖ్యంగా ఏడుపాయలకు వచ్చే భక్తులు ఇంటికి వెళ్తుంటారు. ఈ క్రమంలో ఈ గుంత వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఏ ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి గొయ్యి పూడ్చి వేయాలని భక్తులు కోరుతున్నారు.



ఏడుపాయల రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

కులవృత్తి జోలికి వస్తే ఊరుకోం



మాట్లాడుతున్న గౌడ సంఘం నేతలు

శివ్వంపేట(నర్సాపూర్): గౌడ కులస్తుల కులవృత్తి జోలికి వస్తే ఊరుకునేది లేదని గౌడ సంఘం నేతలు అన్నారు. శనివారం మండల కేంద్రం శివ్వంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షుడు రమణగౌడ్, మండలాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, తదితరులు మాట్లాడుతూ.. ఈతవనాల రైతు సంఘం ఏర్పాటును వారు తప్పు పట్టారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. తాత ముత్తాతల కాలం నుంచి గ్రామాల్లో గౌడ కులస్తులు మాత్రమే కల్లు గీత చేపట్టి విక్రయాలు చేస్తున్నారన్నారు. అలాంటి వృత్తికి సంబంధం లేని వారికి టీఎఫ్‌టీ లైసెన్సు ఏ విధంగా జారీచేస్తారని ప్రశ్నించారు. ఈత వనాలు పెంచిన వారికి డబ్బులు చెల్లించి గీత చేసుకునేందుకు గౌడ కులస్తులు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాంటప్పుడు ఇతర కులాలకు సంబంధిన వారు మా కుల వృత్తిలోకి ఎలా వస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, నట్‌రాజ్‌గౌడ్, మహేశ్‌గౌడ్, రాంచందర్‌గౌడ్, సురేశ్‌గౌడ్, గణేశ్‌గౌడ్, నర్సింలుగౌడ్, సత్యనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్టీసీ ప్రతినిధి భూమయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌లో ఆర్టీసీ ప్రతినిధి భూమయ్య శనివారం గ్రామస్తులకు ఆర్టీసీ సేవలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు సౌకర్యం కోసం ఆర్టీసీ టీ30, టీ60 టికెట్ ప్రవేశపెట్టిందన్నారు. టీ30 రూ 50, టీ60 రూ. 100 ఇస్తున్నమన్నారు. దీంతో డబ్బులు ఆదా అవుతాయని, విద్యార్థులకు బస్‌పాస్, రోజువారీ ప్రయాణికులకు నెలవారి పాస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నెలవారి పాస్‌తో 20రోజుల డబ్బులతో 30రోజులు ప్రయాణించవచ్చన్నారు. ఆర్టీసీ బస్‌లు శుభకార్యాలకు సైతం అద్దెకు ఇవ్వనున్నట్లు, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆశమ్మ, ఉపసర్పంచ్ జగన్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం, గ్రామస్తులు సంతోషగౌడ్, బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. శనివారం మండలంలోని దేవులపల్లి, కూకుట్లపల్లి ముట్రాజ్‌పల్లి గ్రామాల్లో ఏఎన్ఎంలు శిరోమణి, రిబ్క తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత నివారించుకునేందుకు ఆకుకూరలు, పాలు, కోడిగుడ్డు తినాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుగుణ, నీరజ, అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, నాగరాణి, పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

తూప్రాన్: మున్సిపాలిటీ పరిధిలోని తాతపాపనపల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను జూనియర్ పశు వైద్యుడు లింగమూర్తి శనివారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. ఈ వ్యాధి సోకినట్లయితే పశువుల కాళ్లలో పుండ్లు, నోట్లో పొక్కులు ఏర్పడి, పశువులు మేత సరిగా మేయక అనారోగ్యానికి గురై పాల దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మామిడి వేంకటేశ్, వెంకటేశ్‌యాదవ్, మల్లేశ్, గోపాలమిత్ర శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన ఉపాధ్యాయులు



హైదరాబాద్‌కు వెళ్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చేగుంట(తూప్రాన్): సీపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా కోసం శనివారం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తరలి వెళ్లారు. పలు రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేసినందున తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్ విధానం రద్దు చేయాలని ధర్నాకు వెళ్తున్నట్లు తపస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో వివిధ సంఘాల నాయకులు వెంకటేశ్, మనోహర్, రామకృష్ణ, పెంటాగౌడ్, మధు, రమేశ్, శంకర్, అమరేశ్వరీ, ప్రశాంత, సంకీర్తన తో పాటు పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

తారురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలో పలు తారురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నర్సంపల్లి జెడ్పీరోడ్డు నుంచి పెద్ద తండామీదుగా జెమ్లా తండా వరకు 1.2 కిలోమీటర్లమేర తారు రోడ్డు నిర్మాణానికి రూ. 90 లక్షలు మంజూరైనాయన్నారు. జెడ్పీరోడ్డునుంచి నర్సంపల్లి చిన్నతండా మీదుగా కాస్లాపూర్ వరకు 2.5 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికిగాను రూ.2.12 కోట్లు మంజూరైనాయన్నారు. నిధుల మంజూరుకై సహకరించిన మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మెదక్‌రూరల్ సీఐగా రాజశేఖర్

హవేళీఘనపూర్: మెదక్ రూరల్ సీఐగా పని చేసిన విజయ్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గజ్వేల్ రూరల్ సీఐగా పని చేసిన రాజశేఖర్ శనివారం మెదక్ రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యం

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యమని అఖిలపక్ష నాయకులు అన్నారు. రామాయంపేట పట్టణంలో రెవెన్యూ డివిజన్ సాధన కోసం కొనసాగుతున్న దీక్షలు శనివారం నాటికి 139 రోజులకు చేరుకున్నాయి. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు తాము విశ్రమించమని, ఆందోళన తీవ్రతరం చేస్తామని అఖిలపక్షం నేతలు హెచ్చరించారు. ఈ దీక్షలకు పలు పార్టీలతో పాటు యువజన సంఘాలు, కుల సంఘాలు తమ మద్దతు ప్రకటించాయి.

పెట్రోల్ దొంగతనాలపై ఫిర్యాదు: కాలనీవాసులు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని మాధవనగర్ కాలనీలో కొన్ని రోజులుగా ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ దొంగతనం చేస్తున్నారని పలువురు కాలనీ వాసులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ల నుంచి పెట్రోల్ దొంగతనం చేస్తున్న దొంగలను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ బాలరాజుకు కాలనీ వాసులు ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ పిల్లల వివరాలు ఇవ్వండి

పాపన్నపేట(మెదక్): మండలంలో ఉన్న అనాథ పిల్లల వివరాలు సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వాలని ఎంపీపీ లక్ష్మీకాంతరెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 24 ఏళ్ల లోపు వయస్సు ఉన్న అనాథ పిల్లల వివరాలు ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్ అభివృద్ధికి కృషి

పాపన్నపేట(మెదక్): ఆల్ ఇండియా కాంగ్రెస్ కార్యదర్శి, మెదక్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పీసీ విష్ణునాథన్‌ను శనివారం హైదరాబాద్‌లో కలసినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాల్సిందిగా ఆయన కోరినట్లు చెప్పారు.

జాతీయ జెండాల పంపిణీ

కొల్చారం(నర్సాపూర్): ఈ నెల 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం సంగాయిపేట గ్రామ సర్పంచ్ మానస ఆధ్వర్యంలో పోస్టాఫీస్ ద్వారా త్రివర్ణ పతాకాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగంపేట బ్రాంచ్ సబ్‌పోస్ట్ మాస్టర్ సందీప్, గ్రామ పోస్ట్‌మెన్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా అభివృద్ధి

- కాలనీవాసుల నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

రేగోడ్(మెదక్): నాలుగేళ్లుగా తమ కాలనీలో అభివృద్ధిని పట్టించుకోవడం లేదని సర్పంచ్‌పై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. మండల కేంద్రం రేగోడ్‌లోని 11వ వార్డులోని ప్రజలు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలా సంవత్సరాలుగా తమ కాలనీని సర్పంచ్, అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. వీధి స్తంభాలకు బల్బులు పెట్టలేదని, రాత్రిళ్లో చీకట్లో ఉంటున్నామన్నారు. సీసీరోడ్లు, మురుగు కాల్వలు నిర్మించలేదని తెలిపారు. వర్షాలు పడితే నడక నరకంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిచ్చిగడ్డి ఏపుగా పెరిగిందని, పాములు వస్తుండటంతో భయం భయంగా గడుపుతున్నామని చెప్పారు. రోజూ చెత్తను కూడా తీసుకెళ్లడం లేదని, పనులు చేయమని అడిగితే మళ్లీ వచ్చే సర్పంచ్ చేస్తారనడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా అధికారులు రేగోడ్‌పై దృష్టి పెట్టకపోవడంతోనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల జాడ లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్ల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు సుమారు రూ. 8 కోట్లను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మంజూరు చేయించినట్లు ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుక్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు 2.49 కోట్లు, పోతాన్‌శెట్టిపల్లి నుంచి పెద్దశివునూర్ రోడ్డు వరకు 2.50 కోట్లు, బోనాల్ గ్రామం పిట్టల తండాకు 2.40 కోట్లు సీఆర్ఆర్ నిధుల నుంచి మంజూరీ చేయించినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయించిన ఎంపీకి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, రాజిరెడ్డి, తానీషా, నెల్లూరి తదితరులు ఉన్నారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవాలి



నిర్మాణం వెనకభాగంలో ఉన్న కాల్వ ప్రదేశాన్ని చూపుతున్న మోహన్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవాలని వెల్దుర్తి ఎంపీటీసీ–2 మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాభూమిలో అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపడుతుంటే, కొందరు నాయకులు ప్రభుత్వ పొనాదిని ఆక్రమించానని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 2,332లో గ్రామానికి చెందిన ఆరేళ్ల సాయిలు అనే వ్యక్తి వద్ద 11 గుంటల పట్టాభూమిని కొనుగోలు చేశానన్నారు. తాను కొనుగోలు చేసిన భూమికి వెనకభాగంలో చెరువు కాలువ(పొనాది) ఉన్నా రాజకీయ కక్షతో తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. తాను ప్రభుత్వ పొనాదిని ఆక్రమించినట్లు చేసిన ఆరోపణలు నిరూపిస్తే నిర్మాణ పనులను నిలిపివేసి ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

నిరుద్యోగుల సమావేశానికి తరలిరావాలి



సమావేశంలో మాదిగ, ఉప కులాల నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: ఈనెల 14న మెదక్‌లో మాదిగ ఉపకులాల సమావేశం జరుగుతుందని నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ లింగంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం మెదక్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగ ఉపకులాల నిరుద్యోగుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. మెదక్ పట్టణంలోని ద్వారకా గార్డెన్స్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని మాదిగ, ఉప కులాల నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజు, మహిళా నాయకురాలు జేపీలత, బుడజంగాల నాయకులు శంకర్, కిరణ్, శ్రీశైలం, మల్లేశం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో ఎస్ఎఫ్ఐ నాయకులు

నిజాంపేట(మెదక్): గ్రూప్ 2 పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వగా శనివారం మండలంలో పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. గ్రూప్ 2 అభ్యర్థులపైన లాఠీచార్జ్, అరెస్ట్‌లు చేయడం సరైంది కాదని, ఎస్ఎఫ్ఐ గ్రూప్ 2 అభ్యర్థుల పక్షాన నిలబడుతుందన్నారు. ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టులు చేయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వం తమ మొండి వైఖరిని వదిలి, మూడు నెలలకు వాయిదా వేయాలని లేనిపక్షంలో ప్రగతి భవన్ ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి ప్రకాశ్, పోలీస్‌లు జయపాల్ రెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు రంగనాథన్


- గ్రంధాలయ సంస్థ అధ్యక్షుడు చంద్రాగౌడ్



మాట్లాడుతున్న చంద్రాగౌడ్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 131వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు దొంతి చంద్రాగౌడ్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ శాస్త్ర పితామహుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ రంగనాథన్ వృత్తిపరంగా గణిత శాస్త్ర ఆచార్యుడన్నారు. గ్రంథాలయ శాస్త్రంలో పంచ సూత్రాలను తయారు చేసి, గ్రంథాలయ శాస్త్రానికి వన్నె తెచ్చారని కొనియాడారు. రంగనాథన్ జయంతిని లైబ్రేరియన్‌డే గా జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వంశీకృష్ణ, కౌన్సిలర్ కృష్ణారెడ్డి గ్రంథాలయ ఉద్యోగస్తులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సతీశ్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడ్డ ప్రమాదంలో గాయాపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కౌడిపల్లి ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 5వతేదీన కామారెడ్డి జిల్లా శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన సతీశ్(28) అతని బావ రాజు హైదరాబాద్ నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా.. కౌడిపల్లి బట్టమ్మదేవి ఆలయం వద్ద జాతీయ రహదారి 765డీ పై కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి సైడ్ రేలింగ్‌ను ఢీకొనగా తీవ్ర గాయాలైన రాజు అక్కడికక్కడే మృతి చెందిన విషయం విధితమే. కాగా హెల్మెట్ ఉన్నప్పటికీ తలకు తీవ్రగాయాలు అయిన సతీశ్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఇంటి వద్ద మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దళితబంధు నిలిపి వేయాలని వినతి

కొండపాక (గజ్వేల్): దళితబంధు పథకంలో మాదిగ కులస్తులకు కేటాయించిన యూనిట్ల లబ్ధిదారుల ఎంపిక నిలిపి వేయాలని కోరుతూ కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామ దళిత మహిళలు శనివారం సీఎం, కలెక్టరు కార్యాలయానికి, పోలీస్టేషన్‌కు వినతి పత్రాలను పంపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దళితబంధు పథకంలో తిప్పారం గ్రామానికి 11 యూనిట్లు మంజూరయ్యాయి. మదిర గ్రామం సింగారం గ్రామానికి 3, తిప్పారంలోని ఎస్సీ మాల కులస్తులకు 3 యూనిట్లు, మాదిగ కులస్తులకు 5 యూనిట్లుగా కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. మాదిగ కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, ఎక్కువ యూనిట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264